# దెబ్బకి దెబ్బ

శ్రీమతి సి రాధాదేవిగారు

సహారాఎడారిలో మంచినీళ్లైనా తేలికగా దొరకవచ్చు గాని మన దేశంలో పెండ్లికొడుకులు దొరకడం మాత్రం దుర్ఘటమైపోతోంది. అయినప్పటికీ చీమకుట్టినంత బాధ అయినా కూతురు పెళ్ళిని గురించి కలగని తండ్రి ఎవరైనా ఉన్నారా అంటే భావరాజు భద్రయ్యగారే ఆయన కూతురు మధుమతికి పదిహేనోఏడు వచ్చింది. అట్టే అందకత్తెకాదు. పోనీ విద్య నే అందమనుకుందామంటే అమ్మాయి ఆరోక్లాసుతోనే బడిమానేసి ఇంట్లో కూర్చున్నది చదువు లేకపోతే సంగీతం వచ్చుననుకుందామా అంటే అమ్మాయి గొంతెత్తితే చుట్టుపక్కల నిలబడటం కష్టం సంగీతం కాకపోతే కుట్టుపనీ మొదలయినవాటిలో ప్రజ్ఞఏమైనా ఉన్నదా అంటే అమ్మాయికి ఆరంభశూరత్వమే కాని దేనిలోనూ నిలకడలేదు. అన్నీ ఆర్భాటంగా మొదలు పెడుతుంది కాని ఒక్కటీ కొనసాగించదు. అయితే మాత్రం ఆ అమ్మాయికి ఏం తక్కువైంది? మీతో సంబంధం కలుపుకోవాలని ఉందని భద్రయ్యగారికి ఎన్నో ఉత్తరాలు వస్తున్నయ్. చాలమంది కొమ్ములు తిరిగిన పెద్ద మనుషులే తన గడపలోకి వచ్చి మీ అమ్మాయిని మా అబ్బాయికి ఇస్తారాఅని అడిగి వెళ్తున్నారు. వాళ్లంతా వక ఎత్తు. ఇవాళ పొద్దున ఇచ్ఛాపురంనుంచి లక్షాధికారి లక్కరాజు లక్ష్మయ్యగారి తరఫున వచ్చిన మనిషి ఒక ఎత్తు. పిల్లవాడు బుద్ధిమంతుడు అందగాడు. చదువుకుంటున్న వాడు. ఎన్ని సంబంధాలు వచ్చినా వాళ్ళ తండ్రి తిరగగొడుతున్నాడు, మా అబ్బాయి ఇప్పుడే పెళ్ళి చేసుకోడని. అటువంటి వాడే తనతో వియ్యం పొందాలని ఉవ్విళ్ళూరుతూ మనిషిని పంపటం ఎంత గొప్ప సంగతి! ఇంకో సాటి తండ్రికైతే అర్థమయేది కాదేమో గాని భద్రయ్యగారికి మాత్రం లక్ష్మయ్యగారి ఎత్తు క్షణంలో అర్థమయింది. తను ఏభయ్యోపడిలో పడ్డాడు. తనకి మధుమతి ఒక్కతే కూతురు. తన లక్షాఏభై వేల రూపాయలు ఆస్తీ అల్లుడికే పోతుంది. అందుకనే మధుమతికి ఇంత విలువ అని తెలుసుకున్నాడు. తెలుసుకుని వచ్చిన వాళ్లందరితోనూ—నా తదనంతరం ఆస్తి రావలసిందేగాని నేను బతికున్నంతకాలమూ ఆస్తి నా అధీనంలోనే ఉంటుంది, అల్లుడికి కట్నం మాత్ర ఆరువేలు ఇస్తానని చెప్తున్నాడు. లక్ష్మయ్యగారి తరఫు పెళ్ళిపెద్ద ఈ షరతులన్నిటికీ తల ఊపుతున్నాడు. భద్రయ్యగారికి చిత్రంగా ఉంది. చివరికి సుమూహుర్తం నిశ్చయం అయేదాకాకూడా వచ్చింది. వచ్చే వైశాఖమాసంలో అంటే ఇవాళికి ఇంకా అయిదు నెలలు వ్యవధ ఉంది.

ఇంకేముంది? పెద్దమోతుబరులిద్దరూ వియ్యంపొందుతున్నారని, అంతా పొంగిపోయారు పెళ్ళి ఎంత వైభవంగా జరుగుతుందా అని ఊహాగానం చేయటం సాగించారు కూడాను.

ఇల్లా ఉండగా ఒకనాటి టపాలో భావరాజు భద్రయ్యగారి దగ్గరనుంచి లక్కరాజు లక్ష్మయ్యగారికి ఒక ఉత్తరం వచ్చింది. భద్రయ్యగారు తన భార్యకి పదిహేనేళ్ళ తరువాత మళ్లీ కానుపు వచ్చిందనీ, ముహూర్తం పురుడు వెళ్ళిన తరువాతకి మార్పించవలసిందని వ్రాశారు. ఎల్లాగైనా సరే ఈ సంబంధం చెడిపోయేటట్లు చూడాలని పన్నాగం చేశారు. చివరికి భద్రయ్యగారికి జాబు 'నా కొడుకు జాతకమూ మీ కూతురిజాతకమూ సరిపోలేదని మా సిద్ధాంతిగారు చెపుతున్నారు—అందువల్ల మీరు మరొక సంబంధం విచారించుకోండి' అని వ్రాశారు ఆవలిస్తే పేగులు లెఖ్ఖపెట్టే మనిషి భద్రయ్యగారు. ఇట్టే కనిపెట్టాడు. తనకు పుట్టబోయే శిశువు మగపిల్లాడయితే లక్ష్మయ్యగారి ఆశలన్నీ నేలపాలయిపోవూ? ఒకవేళ ఆడపిల్లయినా ఆస్తిలో సగమేగా తన కోడలికి వచ్చేది? ఇదంతా ఆలోచించి సిద్ధాంతి మీద పాపమంతా రుద్దివేశాడని భద్రయ్యగారు క్షణంలో కనిపెట్టి "నేను ముందరే అనుకున్నాను, ఆయన ఎంతసేపూ డబ్బు వాడేనని! పోనీ వాళ్ళ కర్మం. నేనేం చేస్తాను. వీళ్ళకోసం నేను ఇప్పుడే సన్యాసం పుచ్చుకుంటానా యేమిటి"

అని చిన్న స్వగతం చెప్పుకున్నాడు. ఉత్తరం చూసి మధుమతి తల్లి "ఈపాటి సంబంధం రాకపోదులే" అనుకుని ఊరుకున్నది.

మధుమతితల్లికి పురుడువచ్చింది. మగపిల్లాడు. కాని పురిటి నాలుగోనాడే ఆ పిల్లాడికి ఋణం తీరిపోయింది. తల్లి ఏడ్చి ఏడ్చి చేసేదిలేక సంబాళించుకున్నది. మధుమతికి తమ్ముడు పుట్టాడనగానే పుట్టెడు సంబరంకలిగింది. కాని ఇన్నాళ్ళనుంచి పెళ్ళి బజారులో తనకున్న విలువ ఒక్కసారిగా తమ్ముడివల్ల మాయమైపోయిందే అన్న స్వార్థం కూడా కలగసాగింది. తమ్ముడు పోయినప్పుడు ఎంతో ఏడ్చింది. కాని ఆ ఏడ్పులో కొంత తృప్తి ఉన్నదన్నమాట నిజం. కారుగమ్మిన మబ్బు ఇట్టే తేలిపోయినట్లనిపించింది. కొడుకు పుట్టినందుకు భార్య ఎంత సంతోషించిందో భద్రయ్యా అంతే ఉప్పొంగాడు. కొడుకు పోయినందుకు భార్య గగ్గోలు పెట్టినంతగా భదయ్య వాపోవలేదు. ఎందుకంటే ఆయనకు జాతకం మీద గట్టి నమ్మకం. తన జాతకంలో పురుషసంతతి లేదని ఎన్నడో స్పష్టమైంది. ఇది మధ్యగా వచ్చిన ప్రమాదం, మధ్యగానే పుటుక్కుమంటుందని మొదటినుంచీ ఆయనకి భయంగానే ఉన్నది.

కొన్ని నెలలు గడిచిపోయాయి. భద్రయ్యగారింటికి మునపటిలాగే సంబంధాలవాళ్ళు మళ్ళీరావటం సాగించారు. లక్ష్మయ్యగారి తరఫున మునుపువచ్చిన పెద్దమనిషే మళ్ళీ వచ్చి—సిద్ధాంతి తప్పుజాతకంవల్ల ఇదంతావచ్చింది, ఇప్పుడు మరొక గొప్పదైవజ్ఞుడు మా అబ్బాయిజాతకమూ మీ అమ్మాయిజాతకమూ దివ్యంగా ఉన్నాయని చెప్పాడు, మాఘీలు వెంట లగ్నంపెట్టుకుందాం అన్నాడు. భద్రయ్యగారి ఒళ్ళు భగ్గుమన్నది. ఏమనిచెప్పాలో తోచలేదు. డబ్బే మనుషులకంటే ముఖ్యమనుకునేవాళ్ళు లోకంలో ఉన్నారు, కాని ఎక్కడా ఇంత అన్యాయంలేదనిపించింది. బదులుకి బదులు తీర్చుకోవాలని సమయంకోసం ఎదురుచూస్తున్నాడు.

నేను ఉత్తరం వ్రాస్తానని చెప్పండి అనివచ్చినపెద్దమనిషిని పంపివేశాడు.

ఇంతలో ఎల్లా తెలిసిందో తెలిసింది, ఈ మధ్యనే అరవయ్యోపడిలోవున్న లక్ష్మయ్యగారికి నాలుగోకొడుకు పుట్టాడన్న సంగతి భద్రయ్యగారికి. ఇదివరకు మధుమతి నిద్దామనుకున్నప్పుడు ఆయనకి ముగ్గురేకొడుకులు. ఇప్పుడు లక్ష్మయ్యగారి ఆస్తిని పంచుకునేవాళ్లు నలుగురు. అందుకని భద్రయ్యగారు "మీ అబ్బాయికి మా అమ్మాయినివ్వటం అంగీకారమే. కాని కట్నం నాలుగువేలే ఇస్తాను. ఆరువేలివ్వను. ఎందుకంటే మునుపు మీకు ముగ్గురేకొడుకులు. ఇప్పుడు నలుగురుకదూ? ఇష్టమైతే వెంటనే ఉత్తరం రాయించండి" అని ఉత్తరం రాశారు. జాబుకోసం భద్రయ్యగారు ఎదురుచూడనూలేదు, జాబు రానూలేదు. భద్రయ్యగారి కసి మటుకు కొంతతీరింది!


ఆయుర్వేద నిలయంవారి

లుకోరియా క్యూర్

★

స్త్రీలకు తరచు సంభవించు ప్రదర రోగములకు, బహిష్టునొప్పులకు దివ్యౌషధమని పది సంవత్సరముల అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన యితర గర్భాశయ వ్యాధులన్నియు నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును.

★

90 మాత్రల ప్యాకెట్టు 2-8-0
ప్యాకింగు అండ్ పోస్టేజి అదనం

ఆయుర్వేదనిలయం
రామానాయుడుపేట, మచిలీపట్నం.

అన్ని మందులషాపులలోను దొరకును.


★